ముద్దా సురేష్

(మూడవ భాగము)

"బయటకు పొండిరా దరిద్రపు.... పైతు వెధవల్లారా!"

స్వామీ కేశవానంద్ జీ తిట్లు విని నిశ్చేష్ఠులైపోయారు స్త్రీలు, పురుషులు.

ఏమిటిది?

యిప్పుడు మాట్లాడేది తమ స్వామీజీయేనా?

తమ చెవుల్ని తాము నమ్మలేకపోతున్నారా.... గ్రామీణులు.

"అలా నిలబడతారేం నా ముఖంచూస్తూ దెయ్యాల్లా?"

"ఓహో! మీరు మర్యాదగా చెప్తే వుంటారా?"

పళ్ళు పటపట కొరుకుతూ స్వామీజీ చటుక్కున సంతోషిమా విగ్రహం చేతిలో వున్న శూలాన్ని అందుకున్నాడు.

"ఊఁ వెళ్తారా! పొడిచెయ్యమంటారా?" అన్నాడు స్వామీజీ శూలాన్ని ఎత్తి పట్టుకుని, కళ్ళల్లో నిప్పులు కురిసేలా చూస్తూ.

భక్తులు, భక్తురాళ్ళు అదిరిపడి, ప్రాణభయంతో బిల బిలా పారిపోయారు.

* * *

"హేఁ! ఎక్కడ చచ్చాయే యీ గేదెలు?"

పొలికేక పెట్టాడు పశువుల యజమాని భైరవ్, తల పాగా దులిపి, తలకు చుట్టుకుంటూ.

"మళ్ళీ ఆ శంకర్ మియా చేలో పడివుంటాయ్."

గొణుక్కుంటూ పంచె ఎగదోసుకుని వేగంగా నడవ సాగాడు భైరవ్.

అతను గట్టుదిగి, పొలంలో నడుస్తుండగా పొగమంచు లోంచి బయటపడుతున్న గేదెలు కనబడ్డాయి.

పొగమంచు ప్రక్క పొలాలవైపు తేలిపోతూ ప్రయాణించడం గమనించాడు భైరవ్ విస్తుపోతూ.

వింతగావుందే ఆ పొగ?

దాని అంచులు కనబడుతున్నాయి, ప్రత్యేకమయిన ఆకారం వున్నట్టు.

మామూలు పొగమంచులా నేలనంతా ఆవరించలేదు.

అప్పటికే గేదెలు తమ యజమానివద్దకు వచ్చేశాయి.

ముందునడిచే గేదెలు, అతన్ని దాటి వెళ్లిపోసాగేయి.

"అలాగ యెక్కడికే సైతాన్‌కి బచ్చే! ఇటువైపు షెడ్‌కి పదండి!" కోపంగా అరిచాడు, ఓ గేదెమీద బలంగా చరుస్తూ.

అకస్మాత్తుగా ఆ గేదె నిల్చిపోయింది.

తల అతనివేపు తిప్పి-తదేకంగా చూడసాగింది.

"ఛల్ .... ఛల్ ...." అర్చాడు అసహనంగా, భైరవ్ మళ్ళీ దాన్ని చేత్తో చరుస్తూ.

ఆ గేదె నిశ్చలంగా, మౌనంగా అతనికేసే చూస్తోంది. దాన్ని బిగ్గరగా తిట్టిపోస్తూ, భైరవ్ వెనక్కి తిరిగాడు మిగతా మంద యెంతవరకూ నడిచిందో చూద్దామని.

అన్ని గేదెలూ అక్కడే వున్నాయి.

గుంపుగా, అతనివైపు తిరిగి, రెప్ప వాల్చకుండా చూస్తూ.

"ఏమైందే మీకు యివ్వాళ?"

ఎందుకో ఆ స్తబ్ద వాతావరణం భైరవ్‌కి భయాన్ని కలిగించింది. కారణం అతనికే తెలియదు. ఈ రోజు గేదెలు ఎందుకు 'అలా' ప్రవర్తిస్తున్నాయో, అతనికి అర్థంకావడం లేదు.

"చల్ చల్ ....యింటికి పదండి....ఝ....ఝ"....

వాటిని అదిలించసాగాడు.

బొమ్మల్లా నిలబడిపోయిన గేదెల్లో ఆకస్మాత్తుగా చలనంవచ్చి అతని చుట్టూ గుంపుగా మూగిసాగాయి.

ఆ మూగ జంతువుల వైఖరి అతనికేం అర్థం కావడం లేదు.

వెనకనుంచి ఎవరో మెల్లగా త్రోసినట్లయి గిరుక్కున వెనుదిరిగాడు భైరవ్.

వెనక్కి తిరిగేలోగా—అతన్ని లారీ గుద్దినట్లు ఏదో అతని వీపును గుద్దింది....

తూలి, నేలమీద పడిపోయాడు భైరవ్.

"హక్!

పాండి!

వెనక్కి పొండి!

సైతాన్‌కీ బచ్చే...."

పిచ్చిగా అరుస్తూ చేతులతో, మోకాళ్ళతో లేవడాన్కి ప్రయత్నిస్తున్నాడు భైరవ్.

ఉన్నట్టుండి, ఓ గేదె పైకి లేస్తున్న భైరవ్ డొక్కల్లో బలంగా కుమ్మింది, కాలి గిట్టలో.

భైరవ్ రబ్బరు బొమ్మలా వెనక్కి పడ్డాడు.

అతను ప్రాణభయంతో వికృతంగా కేకలు పెట్టసాగాడు.

ఈసారి ఒక దెబ్బ అతని ముఖం మధ్యగా తగిలింది, ముక్కు పచ్చడి చేస్తూ....

బుస బుస పొంగింది రక్తం, అతని విరిగిన ముక్కులోంచి....

కళ్ళు ఒక్కసారిగా మసకలు కమ్మాయి భైరవ్‌కి.

అతను కళ్ళు తెరిచి చూడ ప్రయత్నించినపుడు,

యెదురుగా దృశ్యం పీడ కలలా అవుపిస్తోంది.

గేదెలన్నీ అతనివైపు కమ్ముకుంటున్నాయి....

వాటి కనుగ్రుడ్లు బైటికివచ్చి కోపంగా చూస్తున్నాయి.

వాటి నోళ్ళల్లోంచి తెల్లని నురగ వెలువడుతోంది.

బిక్కచచ్చిపోతూ, యెలాగో పైకి లేవబోయాడు భైరవ్.

అంతే! "ఫట్" మంటూ అతని మోకాళ్ళను మళ్ళీ బలంగా కుమ్మాయి తలతో, రెండు గేదెలు.

అతను కళ్ళను కాపాడుకోనే ఉద్దేశంతో చేతులు ముఖానికి అడ్డు పెట్టుకోగానే, గేదెలన్నీ పళ్ళతో అతని వేళ్ళను కొరికివేయసాగాయి.

దిక్కులు పిక్కటిల్లేలా పెడబొబ్బలు పెడుతున్నాడు భైరవ్, చిత్రహింసలు అనుభవిస్తూ....

ఓ గేదె కాలు, మెరుపులా కదిలి, అతని దవడను విరగ్గొట్టింది....

రక్తం ఉబుకుతూ, గొంతుమీదకి ప్రవహించిసాగింది.

అంతే! స్పృహ తప్పి వెల్లకితలా జారిపడ్డాడు భైరవ్, పచ్చిక నేలపై.

సరిగ్గా అప్పుడు — అన్ని గేదెలు వంతులవారీగా ముందుకు కదిలి అతనిమీద విరుచుకుపడ్డాయి.

• • •

పొగమంచులోంచి బైటకి వచ్చాడు నెమలి పిట్టదొంగ. కాని అతను గ్రామం చివరవున్న తన కొంపవైపు వెళ్ళడంలేదు. అతను తోట యజమాని మేజర్ విశ్వనాథ్ మేడ వెనకభాగంవైపు నడుస్తున్నాడు.

అతను ఎక్కడకు వెళ్ళబోతున్నాడో — అతనికి స్పష్టంగా తెల్సు. కాలా యింతకుముందు కొన్నాళ్ళు విశ్వనాథ్ తోటలో కూలికి పనిచేశాడు.

ఆ తోటలో ఏవైపు ఏముందో, ఎక్కడ దాక్కో వచ్చో, అన్నీ తెలుసు.

యిప్పుడు కాలా, దొంగాడిలా భయపడుతూ పిల్లిలా అడుగులు వేయడంలేదు.

నిదానంగా, ఏ చప్పుడైనా లెక్క చేయకుండా గంభీరంగా నడుస్తున్నాడు.

తోట చివరవున్న పాక ముందాగాడు కాలా. తలుపు తోసుకుని లోపలికి ప్రవేశించాడు.

ఓ వారగా వున్న గొడ్డలిని అతను చేతిలోకి తీసుకున్నాడు.

ఒక్క క్షణం అటూ ఇటూ పరికించాడు.

గూట్లో వున్న మూడంగుళాల పొడవు మేకుల పెట్టె అతని దృష్టి నాకర్షించింది.

ఆ మేకులు ఫెన్సింగ్ కట్టడాన్కి ఉపయోగిస్తారు.

అన్నీ సరికొత్తవి.

అతని చెయ్యి పెట్టెలో జొనిపి, బరబరా చప్పుడు చేస్తూ గుప్పెడినిండా మేకులు అందుకుని జేబులో వేసుకొన్నాడు.

దాక్కునే ప్రయత్నాలేవీ చేయకుండా అతను సూటిగా మేడవైపు నడవసాగాడు.

అతను వెనక తలుపులు చేరుకుంటుండగా, వంటమనిషి సరిగ్గా అప్పుడే తలుపులు బార్లా తెర్చింది.

అంతే!

గొడ్డలి రివ్వున గాల్లోకి లేచి, తనలో నాటుకునే

ముందు ఆమెకు కనీసం అరిచే అవకాశం లేకపోయింది.

కళ్ళు మూసి తెర్చేలోగా అంతా జరిగిపోయింది!

పిచ్చాడిలా వున్న ఆ వ్యక్తిని అరక్షణంపాటు చూడ గల్గిందంతే! మరుక్షణం ప్రాణాలు వదిలింది.

కాలా గంభీరంగా వంటగదిలో ప్రవేశించి, పైకి వెళ్లే మెట్లు ఎక్కసాగాడు.

అతను యింతకుముందు యింట్లోకి ఎప్పుడూ రాలేదు. కాని మాటల శబ్దం అతన్ని డైనింగ్ హాల్ వైపు నడిపించింది.

ఎదురుగా వున్న తలుపు తెర్చి లోనికి నడిచాడు కాలా. ఆ గది ఖాళీగా వుంది. ఎదురుగా మరో తలుపు..

ఆ తలుపు తెరుచుకోసాగింది....

అతను చటుక్కున తలుపు వెనక నక్కాడు.

అడుగుల చప్పుడు....

సన్నగా పాడుకుంటూ పనిమనిషి సగం వదిలివేయబడ్డ ఆహారపదార్థాల 'ట్రే'తో బైటికి వచ్చింది.

గుమ్మందాటి, వంటగదికి వెళ్ళే మెట్లు దిగసాగింది....

"టీ కెటిల్ స్టౌమీద పెట్టావా మున్నీ?" అన్నదామె వంటగది సమీపిస్తూ "వాళ్ళు తిండి మేస్తుండగా మనం రెండు కప్పుల టీ తాగుదాం."

వంటగది ఖాళీగా కనబడింది ఆమెకి.

స్టౌమీద టీ కెటిల్ పొగలు కక్కుతోంది.

చేతిలోని 'ట్రే' నేలమీద పెట్టి గాస్ స్టౌ వద్దకు నడిచిందామె.

స్టౌ వద్దకు చేరుకొంటుండగా తోటలోకి వెళ్ళే తలుపులు బార్లా తీసి వుండడం గమనించిందామె.

చల్లగాలి లోపలకు వస్తోంది.

మున్నీ—బయటవున్న చెత్త కుండీలో తుక్కు పార పోయబోయడానికో, గాలి పీల్చుకోడానికో వెళ్ళిందాలి అనుకుందామె.

గుమ్మందగ్గర వున్న టేబుల్ చుట్టూ తిరిగి నడిచిందామె మున్నీని పిల్చే ఉద్దేశంతో.

అంతే!

ఆమె గొంతును చీల్చుకుంటూ వికృతమైన కేక వెలువడింది....

ఎదురుగా, గుమ్మం అవతల పడివున్న స్త్రీ దేహం—మెదడునుంచి, ముక్కు వరకూ చీలిపోయిన తల....రక్తపు మడుగు....

కళ్ళు బైర్లుకమ్మి స్పృహతప్పి కూలిపోతుండగా ఆమెకు 'మేడమీంచి' కెవ్వున గాలిని చీల్చుకుంటూ వెలువడుతున్న ఓ ఆర్తనాదం లీలగా వినబడింది.

ర ర ర

పనిమనిషికి మెల్లగా స్పృహ వచ్చింది....

మొదట్లో తాను ఎందుకు అలా పడిపోయి వున్నదో ఆమెకు ఏమీ అర్థంకాలేదు.

అకస్మాత్తుగా ఆమె శరీరంమీద వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి....

దాదాపు తన కాలుకు తగుల్తూ పడివున్న మున్నీ శవం ఆమె కళ్ళబడింది....

ఆమె ఒళ్ళు ఎండుటాకులా వణుకుతోంది....

సహాయంకోసం కేక పెట్టాలనుకొంటోంది....

కాని గొంతు పెగల్లేదు.

ఎలాగో ఆమె కాళ్ళమీద లేచి నిలబడింది....

తూలుకొంటూ, బలహీనంగా మెట్లవైపు అడుగు

వేసింది....ముందుకు పడుతూ, నోటిదగ్గర చేయిపెట్టుకుని వెక్కి-వెక్కి ఏడుస్తూ మెట్లు అధిరోహించింది....

ఆఖరి మెట్టు ఎక్కి, ఒగురుస్తూ ఆమె డైనింగ్ హాల్ వైపు పరిగెట్టింది ఎవర్నో పిలవడానికి ప్రయత్నిస్తూ....

తెరిచివున్న గుమ్మంలో తూలుతూ అడుగులు వేసి, తక్కున ఆగిపోయింది ఎదురుగా వున్న దృశ్యం చూస్తూ...

మేజర్ భార్య నేలమీద వెల్లకితలా పడివుంది....

మెడ ఖండించబడి....

చిక్కటి రక్తపు మడుగులో....

జీవంలేని, యజమానురాలి కనుగుడ్లు ఆమెవైపే చూస్తున్నాయి....

విశాలమైన డైనింగ్ టేబుల్ మీద పడివున్నాడు ఆమె యజమాని విశ్వనాథ్, అతని అరచేతులకి, పాదాలకీ, మేకులు దిగ్గొట్టబడి వున్నాయి.

ఒక వ్యక్తి ఆయనమీధ నిలబడి వున్నాడు, చేతిలో రక్తం ఓడుతున్న గొడ్డలితో....

బిక్క చచ్చిపోయి, స్థాణువులా నిలబడి పనిమనిషి చూస్తుండగా ఆ వ్యక్తిలో చలనం వచ్చింది.

అతని చేతిలోని గొడ్డలి రివ్వున గాలిలోకి లేచింది.

మెరుపులా కదిలి, గొడ్డలి వేగంగా క్రిందికి దిగింది....

విశ్వనాథ్ భుజం ఆ గొడ్డలివేటుకి పుటుక్కున తెగిపోయి, గొడ్డలి డైనింగ్ టేబుల్ లో నాటుకొన్నది.

టేబుల్ మీంచి గొడ్డలి విడదీసి, మళ్ళీ పైకెత్తాడు ఆ వ్యక్తి....

అతని గొడ్డలి విశ్వనాథ్ రెండో భుజం తెగ్గొట్టేలోపుగా, ఆయన స్పృహ తప్పిపోయాడు.

ఆ వ్యక్తి—ఆయన కాళ్ళు నరికిన సమయాన్కి విశ్వ

నాథ్ మరణించాడు.

చేతిలోని గొడ్డలితో,

రక్తం చిమ్మిన శరీరంతో,

యమభటుడిలా,

ఆ వ్యక్తి తనవైపు చూడగానే,

పనిమనిషి కెవ్వున కేకలు పెట్టసాగింది,

దశదిశలు దద్దరిల్లేలా!....

* * *

"హలో రాణా!"

రాణా తలెత్తి ఆ యువతివైపు చూసాడు.

"హలో లూసీ!" నవ్వాడు గుర్తింపుగా.

పొంగి పొరలివచ్చే దుఃఖాన్ని బలవంతంగా ఆపుకొంటున్నట్టు సూచిస్తున్నాయ్ ఆమె ముఖ కవళికలు.

"హౌడుయు ఫీల్ డార్లింగ్?" ఆవేదనగా అడిగిందామె.

"ఓ.కే."

రాణా—భావ్‌నగర్‌కి దగ్గర్లో వున్న కాంబే టౌన్‌లోని మిషనరీ హాస్పిటల్ బయటి మెట్లమీద కూర్చొని వున్నాడు.

లోపల వేచివుండటం అతనికి చిరాకు.

ఆసుపత్రి వాతావరణం అంటే అతనికి చెప్పరాని ఎలర్జీ.

"నీకు మరో రెండువారాలు రెస్టు కావాలంటున్నారు డాక్టరు"

మెట్లమీద అతని ప్రక్కగా ఆనుకొంటూ కూర్చుంది లూసీ.

"అవసరంలేదు" తల అడ్డంగా ఊపాడు రాణా.

"యిప్పుడు బాగానే వున్నాను. హాస్పిటల్‌లో యింకో రెండురోజులుంటే, మళ్ళీ తిరగబెడుతుంది 'పిచ్చి' నాకు."

ఆ మాటలకు చలించిపోయింది లూసీ, అతను హాస్పిటల్‌లో చేర్చబడిన మొదటిరోజుల్లో ఎలా ప్రవర్తించాడో జ్ఞాపకం వచ్చి.

భావ్‌నగర్ భూకంప సమాచారం, దేశాన్ని కదిపి వేసింది.

ముఖ్యంగా మహారాష్ట్ర — రాష్ట్రంలోని బొంబాయి చుట్టుపక్కల ప్రాంతాలని.

భూగర్భ శాస్త్రవేత్తలు కంగారుపడ్డారు....

చుట్టుప్రక్కల గ్రామాల్లో, పట్టణాల్లో అలజడి....

గందరగోళం....

ఉద్యోగ బాధ్యతలమీద అతను భావ్‌నగర్ పరిసరాల్లో వున్నట్టుకూడా ఆమెకి తెలీదు.

అలాంటి విషయాల్లో సీక్రెటివ్‌గా వుంటాడు రాణా.

లూసీకి, రాణా చేసే ఉద్యోగం ఏమిటో తెల్సినా, దాన్నిగురించి యింకా కొన్ని అనుమానాలు లేకపోలేదు.

ఆ రోజున మధ్యాహ్నం మూడు గంటలకు రాణా ఆఫీసుకి ఫోన్ చేసింది లూసీ.

వివరాలు దొరికాయి.

అతను కాంబే మిషనరీ హాస్పిటల్‌లో జాయిన్ చేయబడ్డాడనీ, ప్రస్తుతం మెంటల్ షాక్‌లో వున్నాడనీ....

దడాలున ఫోన్ పెట్టేసింది లూసీ.

ఆమె గుండె వేగంగా కొట్టుకొంటోంది.

శరీరం వణుకుతోంది. గాభరాగా డైరెక్టరీ తిరగేసి, కాంబే హాస్పిటల్‌కి ఫోన్ చేసింది.

"సారీ మిస్! యిప్పుడు యెవరిగురించీ వివరాలు చెప్ప

లేము. ఫోన్ కాల్స్‌తో జామ్ అయిపోయిన పరిస్థితి ఇక్కడ. ట్రై లేటర్!" అని చెప్పి కనెక్షన్ కట్ చేసింది హాస్పిటల్ ఆపరేటర్.

తండ్రికి చిన్న కాగితంమీద ఓ వాక్యం రాసి, ఆ చీటీ టేబుల్ మీద కనబడేలా పెట్టి, హడావుడిగా కార్లో, బయలుదేరింది లూసీ బొంబాయిని వదిలిపెడుతూ.

కాంబే టౌన్ చేరుతుండగా మార్గ మధ్యంలో పోలీసులు అడ్డగించారామెను. రోడ్డు కడ్డంగా చాలా కార్లు ఆగిపోయి వున్నాయి. అందరూ, భూమి చీలిపోయిన విచిత్ర ప్రదేశాన్ని కళ్ళారా చూడ్డానికి వెళ్తున్నారు, కాలి నడకనా, కార్లలో, బస్సుల్లో....

కాని పోలీసులు వార్ని అడ్డగించి వెనక్కి పంపేస్తున్నారు. రూట్ బస్సులు కాన్సిల్ చేయవల్సిందిగా రోడ్డు రవాణా సంస్థని హెచ్చరించింది పోలీసు శాఖ.

రాణా కండిషన్ చెపుతూ, ఓ పావుగంట బ్రతిమాలిన తర్వాత, ఆమెకు పచ్చదీపం చూపారు ట్రాఫిక్ పోలీసులు.

రేసు గుర్రంలా పరిగెత్తింది లూసీ కారు.

పోలీసుల సలహామీద,వాహనాన్ని కాంబే ఊరి చివర ఆపేసి నడుచుకుంటూ హాస్పిటల్‌కి బైల్దేరింది లూసీ.

ఆసుపత్రి చేరుకుని, పోలికలు చెప్పి రాణా గురించి ఎంక్వైరీ చేసింది లూసీ.

కిటకిటలాడుతోంది హాస్పిటల్.

భూకంపానికి గురైన యితర బాధితుల బంధువులతో పాటు, బయట వెయిట్ చేయవల్సిందిగా కోరబడిందామె.

రాత్రి యెనిమిది గంటలదాకా ఆమెను ఎవరూ పలక

రించలేదు. అప్పుడు ప్రత్యక్షమయ్యాడు అల్సిపోయిన ముఖంతో ఓ డాక్టర్. ఆమెను మూలగా తీసుకెళ్ళి చిన్న గొంతుకతో సలహాయిచ్చాడు, ఆ రాత్రికి లూసీ యిక పేషంట్‌ని చూడకపోవడం మంచిదని.

రాణా మెంటల్‌గా తీవ్రమైన షాక్‌కి గురి అయ్యాడనీ, తనకు తానే చేసుకొన్న గాయంవల్ల, 'బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్' చికిత్స చేసామనీ, ప్రస్తుతం అతను ఘాటైన మత్తుమందు ప్రభావంలో నిద్రిస్తున్నాడనీ వివరించాడు డాక్టర్.

లూసీ ఉన్న ఉద్రిక్త పరిస్థితిని గమనించి, ఆమెకు 'అసలు' విషయం చెప్పలేదు డాక్టర్.

నిజానికి—రాణాకి పూర్తిగా పిచ్చెక్కింది!

మత్తులో వున్నాకూడా—అతను బెడ్‌కి పెడరెక్కలు విరిచి, బంధించబడ్డాడు.

అతన్ని మంచానికి బంధించడాని కారణం—ఉన్మాదంలో ఎవరికీ అపకారం చేయకుండా, తనకుతాను అపకారం తలపెట్టకుండా-చూడ్డంకోసం.

ఆ విషయాలన్నీ చెబితే లూసీ, కొలాప్స్ అయి పడిపోతుందని డాక్టర్కి తెలుసు.

'బహుశా రేపు చెప్పవొచ్చు' అనుకొన్నాడు డాక్టర్.

రాణాని తీసుకువచ్చే దారిలో, అతను ఆంబులెన్స్ అద్దాన్ని స్మాష్ చేశాడనీ, ఒక పొడుగాటి అద్దం ముక్కతో తన గొంతులో పొడుచుకోబోయాడనీ, అతన్ని నలుగురు బలంగా ఆపవల్సి వచ్చిందనీ, రాణాను రక్షించబోయిన డ్రైవర్—అతని దెబ్బకు దవడ ఎముక విరగ్గొట్టుకొని యిదే హాస్పిటల్‌లో లాండ్ అయ్యాడనీ—చెబితే లూసీ....?

పత్రికా విలేఖరులతో,

దగ్గర్లోని, భావ్‌నగర్ నుండి భయంతో పారిపోయి వచ్చిన గ్రామస్థులతో,

క్రిక్కిరిసిపోయిన ఓ లాడ్జిలో ఆరాత్రి గడిపింది లూసీ.

గుమిగూడి, చెప్పుకొంటున్న వారి అనుభవాలు పూర్తిగా విన్నది లూసీ. వారికి కథనం ప్రకారం—

భావ్‌నగర్ గ్రామంలో నూటయాభై మంది మరణించారట. మరో వందకు పైగా గాయపడ్డారు.

మరువరాని సంఘటనగా ఓ పసిపాప గురించీ, ఓ వ్యక్తిగురించీ—మరీ మరీ చెప్పుకొంటున్నారు.

వారిద్దరూ మృత్యువు నోటిలోంచి ప్రాణాలతో రక్షించబడ్డారు. లోపల ఉండగా వారు పైకిలాగబడ్డారు.

స్పృహ తప్పివున్న స్థితిలో పసిపాప—

ఆ వ్యక్తి షాక్‌లో వుండగా—

చాలాసేపు తర్వాతగానీ, తెలియలేదు లూసీకి వారు రాణా గురించి మాట్లాడుకొంటున్నారని.

మర్నాడుదయాన్నే లూసీ హాస్పిటల్‌కి పరిగెట్టింది.

ఈసారి — మధ్యాహ్నం రావల్సిందిగా కోరాడు డాక్టర్.

కారణం—కంట్రోల్ చేయిలేని వ్యక్తిగా మారాడు రాణా.

ఇంతకు ముందు ఆమె ఎరిగిన రాణాలా ఇప్పటి రాణా లేడు. అంతగా చూడాలనుకొంటే—అతని పరిస్థితి చూసి షాక్ తినడాన్కి సిద్ధపడి రావొచ్చు. యిదీ డాక్టర్ చెప్పిన కారణాలు.

రాణా కళ్లారా చూసిన సంఘటనను తట్టుకోలేక

అలా మారాడని, కొంత విశ్రాంతి యిస్తే కోలుకుంటాడనీ ఓదార్చాడు డాక్టర్.

కాని, లూసీ ఒత్తిడి చేసింది — తాను వెంటనే రాణాని చూడాలని.

తర్వాత బాధపడింది—ఒత్తిడి చేసినందుకు. డాక్టర్ చెప్పింది అక్షరాలా నిజం!

అతను తనకు యింతకుముందు తెల్సున్న రాణా కాదు.

ఒక జంతువు!

వికృతంగా అరిచే జంతువు.

తోలు బెల్టులతో మంచానికి నాలుగువైపులా అతని కాళ్ళు చేతులు బిగించి కట్టబడ్డాయి.

స్పెషల్ వార్డులో వున్న ఒకే ఒక బెడ్ మీద—ఆ గదికి కిటికీలు లేవు.

పేషెంట్ చేతివేళ్ళు, తల పాదాలు మాత్రమే కదప గలడు.

అతని మెడకు బాండేజి వేయబడి వుంది.

తన నాలిక తానే కొరుక్కోకుండా నోటికడ్డంగా ఏదో కుక్కబడి ఉంది....

జంతువు పంజాల్లా, అతని చేతివేళ్ళు వెనక్కీ ముందుకి కదుల్తున్నాయి....నిర్విరామంగా.

అతని కళ్ళు—

వెడల్పుగా అయిన అతని కళ్ళలో—

ఆ పిచ్చి చూపులు తను జీవితంలో మర్చిపోలేదు.

అతను తన నోట్లో కుక్కబడ్డ 'వాడింగ్'ని పళ్ళతో వదులు చేసుకొని, తుపుక్కున ఉమ్మాడు.

మరుక్షణం....భీకరంగా అరవసాగాడు.

బూతులు తిట్టసాగాడు....

ఒక్క క్షణం—అతని క్రోధపూరితమైన కళ్ళు—లూసీ వంక చూసాయ్.

కాని ఆ చూపుల్లో గుర్తింపు లేదు.

ఓ నర్సు పరిగెట్టుకొంటూ వచ్చింది....

మరోసారి మూది బెండులాంటి దాన్ని అతని నోట్లో కుక్కింది—అతను తన వేళ్ళు కొరక్కుండా జాగ్రత్త పడుతూ.

అశ్రుధారలు దృష్టిని మసకపరుస్తుండగా లూసీ మెరుపులా ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టింది.

ఖచ్చితంగా తను ప్రేమించిన వ్యక్తిలా లేడు ఇప్పటి రాణా.

రాక్షసత్వం అతని ప్రతి కదలికలో కనబడుతోంది.

తిరిగి రాణా మామూలు మనిషి కాగలడా?

గంటల తరబడి ఏడుస్తూ, హోటల్ గదిలో గడిపిందామె.

ఓపిక తగ్గి నీరసం రాగా, తన బాధను మరొకరితో పంచుకోవాలని ఆక్రోశించింది ఆమె హృదయం.

ఎవరు వున్నారు?

ఎవరికి చెప్పుకోవాలి?

రెండు నిముషాల తర్వాత తండ్రికి ట్రంకాల్ చేసింది లూసీ.

వెంటనే యింటికి వచ్చెయ్యమన్నాడు తండ్రి.

అవును....

మృగంలా మారిన రాణా నుండి,

ఈ భయంకర వాతావరణం నుండి,

పారిపోతే....తనకు ఓదార్పు కావాలి....

'అలాగే' అని తండ్రికి చెప్పబోతుండగా అంతరాత్మ

ఛెళ్ళున కొట్టింది లూసీని.

రాణా ఒంటరివాడు....

అతనికి ఈ విశాల ప్రపంచంలో తను తప్ప ఎవరూ లేరు 'నా' అన్నవాళ్ళు.

దగ్గరుండి, అతని బాగోగుల్ని చూసేదెవరు?? ఓ నిర్ణయాన్కి వచ్చిందామె. మరొకరి సహాయం లేకుండా రాణా ఆరోగ్యం చక్కబడ్తుందని అనిపించిన రోజున బొంబాయి వస్తానని చెప్పి ఫోన్ పెట్టేసింది లూసీ.

మర్నాడు డాక్టర్-లూసీకి రాణాతో రెస్క్యూ చేయబడ్డ లల్లీ అనే పసిపాప గురించి చెప్పాడు....

అగాధంలో వెలువడ్డ గాస్‌ను ఆమె తట్టుకోలేక అసాధారణ కోమాతో పడి, ఆ మధ్యాహ్నమే ప్రాణాలు విడిచింది.

వయసులో పెద్దవాడు కావడంవల్ల, సహజంగా వ్యాధి నిరోధకశక్తి ఎక్కువగా ఉండడంవల్లా—ఆ గాస్ ప్రభావంతో రాణా పిచ్చివాడుగా మారి-ప్రాణాలతో బైట పడ్డాడు.

ఏది యేమైనా మెదడికి యేర్పడ్డ నష్టం—శాశ్వతమా తాత్కాలికమా అన్న విషయం కొద్దిరోజుల తర్వాత గాని నిర్ధారించలేమని చెప్పాడు, డాక్టర్.

మరుసటిరోజు, తిరిగి ఆసుపత్రిని విజిట్ చేసినప్పుడు సంతోషంగా గంతులు వేసింది లూసీ.

రాణా పిచ్చి ప్రవర్తన పూర్తిగా మాయమైంది!!

అయితే అతను యింకా బలహీనంగా ఉన్నాడు, బూడిద రంగులోకి మారిన కళావిహీనమైన ముఖంతో—

గ్లూకోజ్ యింజక్షన్స్ అవసరం యిక లేదు.

ఉన్మాదస్థితి తగ్గడం వల్ల — ఆహారం తీసుకుంటు

న్నాడు.

ఐదారు రోజుల తర్వాత పూర్తిగా కోలుకొని, అతను యింటికి వెళ్ళడానికి రెడీ అయ్యాడు.

ఆస్పత్రి మెట్లమీద రాణా ప్రక్కగా కూర్చున్న లూసీ, అతని చేతిని తన చేతిలోకి తీసుకుంది.

అతను ఆమె బుగ్గలపై సున్నితంగా ముద్దుపెట్టి "థాంక్స్" అన్నాడు నవ్వుతూ.

"ఎందుకు?"

"ఇన్ని రోజులు నన్ను కనిపెట్టి ఉన్నందుకు. భయపడి పారిపోనందుకు."

లూసీ మౌనం వహించింది.

"డాక్టర్లు చెప్పారు నేనెలా ప్రవర్తించే వాడినో. నువ్వు ఖచ్చితంగా జడుసుకొని ఉండాలి."

"అవును. చాలా భయపడ్డాను."

"పూర్తిగా పిచ్చివాడైన మనిషి యింత త్వరగా యెలా కోలుకోగలిగాడా అని వాళ్ళింకా ఆశ్చర్యపోతున్నారు. అగాధంలో బయలుదేరిన గాస్.... లేక దాని పేరేదైనా, అదే కారణమని చెపుతున్నారు. తాత్కాలికంగా మెదడుపై దాని ప్రభావం పడి మాయమైందట.. నేను చాలా అదృష్టవంతుడ్ని. 'అది' ఆ పసిపాపను చంపేసింది." అన్నాడు రాణా తదేకంగా ఎక్కడో చూస్తూ, ఆవేదనగా.

అతని చేయి నొక్కింది లూసీ "యింత త్వరగా హాస్పిటల్ నుండి వెళ్ళడం మంచిదంటావా?"

"ఓహ్ ఎస్! వాళ్ళు ఉండమని చెబుతున్నారు. ఇంకా టెస్టులు చేయాలిట. జబ్బు మళ్ళీ తిరగబెట్టడానికి అవకాశముందేమోనని వాళ్ళ అనుమానం. కాని

నేనొప్పుకోలేను. యిప్పటిదాకా జరిగిన చిత్రహింసలు చాలు. పత్రికా విలేఖర్లు, దూరదర్శన్ వాళ్ళు....వీళ్ళంతా సగం ప్రాణంతో బైటపడ్డ భూకంప బాధితుల వెంట బడి మిగతా ప్రాణం తీశారు. వాళ్ళకు ప్రధానమైన టార్గెట్ నేనయ్యాను. చివరికి రామ్ కింకర్ కూడా నిన్న వచ్చి-నన్ను ప్రశ్నలతో వేధించాడు."

రామ్‌కింకర్ — వాతావరణ కాలుష్య పరిశోధన శాఖలో రాణాపైన ఉండే బాస్!

రామ్‌కింకర్‌ని కొన్ని విషయాల్లో మెచ్చుకుంటాడు రాణా.

మరికొన్ని విషయాల్లో తిట్టుకుంటాడు.

ఎంతో కష్టపడి తను తయారు చేసిన పరిశోధనాం శాలు పట్టికెళ్ళి యిస్తే—"ఫైల్ పగిలిపోతాను" అంటాడు ముక్తసరిగా.

బలమైన యాక్షన్ తీసుకోలేదు అపరాధులమీద, అధికారం వున్నా.

అతని అధికారం—రాజకీయవాదుల జోక్యం ముందు తలవొంచుతోందని రాణా అనుమానం.

"ఏం కావాలట అతనికి?" అడిగింది లూసీ.

"నా వారంరోజుల ఎసైన్‌మెంట్ పూర్తి చేసానో లేదో అడిగాడు" ముక్తసరిగా అన్నాడు రాణా, సిగరెట్ వెల్గించుకుంటూ.

ఆ దారుణ భూకంపానికి కారణం ఖుల్నా మిలటరీ బేస్‌లో జరుగుతున్న ప్రయోగాలా?

అన్న రామ్‌కింకర్ ప్రశ్న గురించి లూసీకి రాణా చెప్పలేదు—చెప్పకూడదు.

ఏది యేమైనా ఆ మహా విపత్తుకు కారణం ఆ మిల

టరీ బేస్ అని చెప్పడానికి రాణా వద్ద కూడా ప్రూఫ్ లేదు.

"ఫాట్ లిటిల్ టోడ్! కోలుకున్న పేషెంట్‌తో చర్చించవల్సిన విషయాలా అవి? ఐ హేట్ హిమ్!" అంది తీక్షణంగా లూసీ.

"నువ్వనుకొన్నంత చెడ్డవాడు కాదు. ఎనీవే, రేపు ఆయనకి రిపోర్టు చెయ్యాలి నా ఎస్సైన్‌మెంట్ గురించి" కోపంగా నోరు తెరుస్తున్న లూసీని చేత్తో వారిస్తూ అన్నాడు. "జస్ట్ ఓ పావుగంట మాట్లాడటమే. తర్వాత ఓ వారం రోజులు శెలవులో వుంటాను."

"యు డూ దట్ రాణా!" అంది కోపంగా లూసీ.

"షూర్!" నవ్వుతూ ఆమె భుజంపై చేయి వేసాడు రాణా.

"నిజంగా లూసీ, యిప్పుడు బలంగా, ఉత్సాహంగానే వున్నాను. గొంతుకలో కొంచెం మంట. అంతే. డాక్టర్లు చెప్పారు నేను చాల చాల అదృష్టవంతుడ్నని. అద్దం ముక్కతో నేను కంఠంలో పొడుచుకున్నది పెద్ద గాయం కాలేదు. ఎనీవే, దేవుడికొక్కడికే తెల్సు యిక్కడ అవసరమైన దానికంటె యెక్కువ విశ్రాంతి తీసుకున్నానని. కమాన్ డార్లింగ్, మళ్ళీ పిచ్చివాడ్ని కాకముందే యిక్కడ్నుంచి పారిపోదాం."

త్రుళ్ళిపడి భయంగా చూస్తున్న లూసీకేసి చూసి పగలబడి నవ్వాడు రాణా.

• • •

రాణా, లూసీ ఫియట్ కార్లో కాంబేని వదిలిపెట్టి శాంతినగర్ అనే గ్రామంలోంచి ప్రయాణిస్తుండగా జరిగింది ఆ సంఘటన....

ఉదయపు ఆకాశం ఆహ్లాదకరంగా ఉంది.

వేగంగా బొంబాయి చూసుకుపోవడం వారి లక్ష్యం కాదు.

అందమైన ప్రకృతిని యెంజాయ్ చేస్తూ ప్రయాణించడం—

దట్టమైన మేఘం నేలబారుగా వారి కెదురైంది....

మామూలు మేఘంలా రూప రహితంగా కాకుండా అంచులు కనబడేట్లు స్పష్టమైన ఆకారంలో విశాలంగా కమ్ముకొని ఉన్నదా మేఘం!

"స్ట్రేంజ్" గొణుక్కుంటూ కారాపాడు రాణా. "అది పొగా, మేఘమా, మంచా?"

"మంచు అంత దట్టంగా ఉండదు. మేఘం నేలమీద యెలా వుంటుంది? పొగ అయితే ఒక్కచోట నిలవదు తేలిగ్గా ఉంటుంది కాబట్టి. వెనక్కి వెళ్ళిపోదాం రాణా. నా ఒంటిమీద ఏదో పాకుతున్నట్టుంది దాన్ని చూస్తుంటే" అంది లూసీ ముందుకు చూస్తూ.

"చాలా దూరం ప్రయాణించాం. వెనక్కి ఎక్కడికెళ్తాం? నెమ్మదిగా దాన్ని దాటి పోదాం. విచిత్రంగా వుంది కదూ—గోడలా నిలబడి అది?"

వెనగ్గా హారన్ కయ్యిన వినబడ్డంతో యిద్దరూ ఉలిక్కి పడ్డారు.

ఓ టూరిస్టు బస్ వెనకాల్నించి రయ్యిన ముందుకు దూసుకుపోయింది.

అందులోంచి స్కూలుపిల్లలు తలలు బైటపెట్టి నాలికలు సాచి వెక్కిరించారు, ఫియట్ కారువైపు చూస్తూ.

"బ్లడీఫూల్!" తిట్టుకొన్నాడు రాణా "అంత

స్పీడ్‌లో ఆ మేఘంలోకి పోతున్నాడు....”

రోడ్డు చివర విశాలంగా అలుముకున్న పొగమంచు బస్సును మింగివేయడం గమనించారు రాణా, లూసీలు.

అకస్మాత్తుగా ఆ పొగమంచు కదిలి, తమవైపు ప్రయాణిస్తోందని గ్రహించాడు రాణా.

“గుడ్ గాడ్! అది ఎంత వేగంగా కదుల్తోందో” విసుపోతూ కారుని ముందుకి పోనిచ్చాడు రాణా.

లూసీ అసహజంగా భయపడుతుండడం గమనించాడు రాణా.

క్షణాలలో వారి వాహనం మేఘం మధ్య భాగంలోకి ప్రవేశించింది.

రాణా ఊహించినదానికంటె దట్టంగా వుంది ఆ పొగమంచు.

ఎదురుగా దారి, లీలామాత్రంగా కనపడుతోంది.

అప్రయత్నంగా కారు నడపసాగాడు రాణా. దారి బాగా కనబడ్డంకోసం విండ్ స్క్రీన్ దగ్గరగా జరుగుతూ.

అప్పుడప్పుడు విండ్ స్క్రీన్ వైపర్స్‌ని ఆన్ చేస్తున్నాడు అద్దంమీద అలుముకున్న పొగను తొలగించడానికి.

రాణాకి ఓ విషయం అరంకావడం లేదు.

ఆ పొగమంచు లేదా మేఘం .... పసుపురంగులో ఉందేమిటి?

సరిగ్గా అదే సమయంలో, ఓ సన్నని, పదునైన వాసన రాణా ముక్కుపుటాల్ని తాకింది. అతని మెదడు కణాల్లో ఓ సన్నని నరం కదిలినట్లయింది!

దీనికీ భూకంపానికీ ఏమైనా సంబంధముందా? ఆ

దారుణ సంఘటన గురించి, యిప్పుడు ఎక్కువగా జ్ఞాపకం లేదు రాణాకి.

మెదడులో చాల కొద్ది భాగంలో యింకా షాక్ ప్రభావం ఉంటుందని డాక్టరు చెప్పారు.

కానీ,

ఎలాగో, ఆ వాసన, ఆ పసుప్పరంగు, ఆ స్తబ్ధ వాతావరణం—అతనిలో దేన్నో మేలుకొలపసాగాయ్.

అంతే!

చలి చమటలు పడుతుండగా కారు నిలిపివేశాడు రాణా.

"క్యాహువా?" భయంగా వేగంగా పల్కింది లూసీ కంఠం.

"నహీం మాలూమ్ లూసీ! అదో రకమైన ఫీలింగ్.... ఈ పొగమంచు నాకు యింతకుముందు పరిచయమున్నట్లు అనిపిస్తోంది...."

లూసీ చేయి, రాణా భుజంమీద పడింది "డార్లింగ్! భావ్‌నగర్‌లో ఏర్పడిన ఎరప్షన్ నుంచి ఓ విధమైన గాస్ లేదా పొగలాంటిది బైటపడిందని పేపర్లు రాశాయ్. గ్రౌండ్‌లోని ఓ విధమైన ప్రేలుడువల్ల అలా జరిగి వుండొచ్చని ఊహించారు వాళ్ళు. యిప్పుడు మన చుట్టూ వున్న పొగా, అదీ ఒకటే...."

"నో లూసీ! ఒక్కటే అయి ఉండదు. అప్పటి పొగ, ఈపాటికి ఆకాశంలో గాలికి చెదిరి, విడిపోయి ఉండాలి. యిలా ముద్దలా వ్రేలాడదు."

"హౌ కెన్ యు టెల్ దట్? భూమిలోంచి పొగ రావడం ఓ అసాధారణ సంఘటన. అలాంటప్పుడు అది ఎలా పనిచేస్తుందో నువ్వెలా చెప్పగలవ్?"

"ఆల్ రైట్! యిక ఆ విషయాన్ని ఈ పొగమంచు మధ్య ఉంటూ చర్చించడం అనవసరం. ఈ మేఘం వెనక్కి కదులుతుండటంవల్ల మనం ముందుకు వెళ్ళడమే సులభం అనుకుంటాను" అంటూ తలుపులు బిగించబడి ఉన్నాయో లేదో పరీక్షించి, విండో అద్దాలు పైకెత్తేసాడు రాణా.

"ఓ. కే. బట్ బీ కేర్ ఫుల్" జవాబిచ్చింది లూసీ.

కారుని మళ్ళీ పోనిచ్చాడు రాణా, కళ్ళు పెద్దవి చేసుకుని ముందుకు చూస్తూ.

ఓ వందగజాలు ముందుకు వెళ్ళగానే ఎదురైంది వారికో దృశ్యం!

యింతకుముందు తమను వెక్కిరించిన-స్కూలుపిల్లల-బస్సు ఓ గోతిలో కూలిపోయి ఉంది——

కుర్రాళ్ళు బస్సు వెనక నిలబడి ఉన్నారు గుంపులు గుంపులుగా మాట్లాడుకుంటూ.

"మిమ్మల్ని రోడ్డుకడ్డంగా నిలబడొద్దని చెప్పానా? పదండి వారకి" కసురుకుందో కంఠం విద్యార్థుల్ని.

లూసీని లోపలే ఉండమని చెప్పి, కారు దిగాడు రాణా, తిరిగి తలుపు మూస్తుండగా మళ్ళీ తాకింది రాణా ముక్కుపుటాల్ని ఆ విచిత్రమైన వాసన!

"ఎవరికైనా దెబ్బలు తగిలాయా?" స్కూల్ మాస్టర్ లా కనబడుతున్న ఆకారాన్ని అడిగాడు రాణా.

"కొంతమంది కుర్రాళ్ళకి చిన్న చిన్న గాయాలయ్యాయండీ."

జవాబిచ్చింది ఆ ఆకారం, రాణాని సమీపిస్తూ, "కాని మా డ్రైవర్ కి తలమీద బలమైన దెబ్బ తగిలింది."

(సశేషం)